క్లుప్తంగా

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకిసేవ దృశ్యం

మహానంది: క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు పట్టి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవార్లను కొలువుంచారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి



కృష్ణారెడ్డి, ఏఓ

జూపాడుబంగ్లా: కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డుల కోసం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు సొంత భూమి ఉండి ఇతర రైతుల వద్ద మరింత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయ చేసే సన్న, చిన్నకారు రైతులు సైతం కౌలురైతు గుర్తింపుకార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుపై భూయజమాని సంతకం ఉండాలన్నారు. కౌలు కార్డు వల్ల రైతుకు అనేక ప్రయోజనాలు ఉంటాయని. పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధరతో పాటు రాయితీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చునన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన జీలుగ, కంది, మినుము విత్తనాలను రాయితీపై ఆర్‌బీకేల్లో అందజేస్తున్నట్లు తెలిపారు.

పదవీ విరమణ తప్పనిసరి



పదవీ విరమణ పొందిన సీసీ కేశవరావును సన్మానిస్తున్న వైకేపీ సిబ్బంది

పాములపాడు: ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అని ఏసీ పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో సీసీగా విధులు నిర్వహిస్తున్న కేశవరావు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏపీఎం అనురాధ, సిబ్బంది తదితరులు కేశవరావును సత్కరించారు. శేషజీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ మేనేజర్లు పాములపాడు గురు, క్రిష్ణారావుపేట తిమ్మప్ప, ఏసీ దేగలయ్య, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్న వివిధ ప్రైవేట్ విద్యాలయాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద డీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యాకానుక కింద కిట్లను వెంటనే పంపిణీ చేసేలా చూడాలని కోరారు.

రైతులకు కౌలు గుర్తింపు కార్డులివ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు రూరల్: మండంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ దామోదర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని, అలాగే 50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు రూ.5 వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్మాణం వేగవంతం

- నిర్వహణలో జిల్లాలో పాములపాడు కేజీబీవీ నంబర్ వన్
- డీఈఓ సుధాకరరెడ్డి వెల్లడి
- పలు పాఠశాలల్లో నాడు- నేడు పనుల పరిశీలన



పాములపాడు కేజీబీవీ పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ సుధాకరరెడ్డి



కేజీబీవీలో రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: నాడు-నేడు కింద ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నేషనల్ హైవే 340 సీ నిర్మాణంలో భాగంగా మండలంలోని క్రిష్ణారావుపేట, రుద్రవరం గ్రామాల్లో కూల్చి వేసిన పాఠశాల భవనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే పాములుపాడు కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూలు, వాడాల జెడ్పీహెచ్ స్కూళ్లను సందర్శించారు. కేజీబీవీ పాఠశాల ఆవరణాన్ని పరిశీలించి నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పాములపాడు కేజీబీవీ నంబర్ వన్ స్కూల్ అని కితాబిచ్చారు. కిచెన్ గార్డెన్‌ను మరింత అభివృది చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి నోట్‌పుస్తకాలు పరిశీలించారు. నాడు నేడులో భాగంగా నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ 85శాతం నాడు నేడు పనులు పూర్తయ్యాయని, మొదటి విడత క్రింద మంజూరైన పాఠశాలలకు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. 2వ విడత మంజూరైన పాఠశాలలకు బిల్లులు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఇసుక సమస్యతో పనుల్లో జాప్యం జరుగుతుందని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి నిర్మాణపనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేషనల్‌హైవే నిర్మాణంలో భాగంగా కూల్చి వేయబడిన పాఠశాలలకు సంబంధించిన పనులు 3 నెలల్లో చేపడతామని తెలిపారు. ఇప్పటికే క్రిష్ణారావుపేట గ్రామం పాఠశాలకు రూ.13 లక్షలు, రుద్రవరం స్కూలుకు రూ.64 లక్షల చొప్పున జేసీ అకౌంట్‌లో జమ అయ్యాయన్నారు. రుద్రవరం గ్రామంలో రెండంతస్తులతో భవన నిర్మాణం చేపట్టి మోడల్ స్కూలులా తయారు చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్ ఉన్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, గోకవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, లింగాపురం ఎంపీపీఎస్ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. గోకవరం జెడ్పీహెచ్ఎస్‌కాదని 4 కి.మీలు దూరంలో ఉన్న కొత్తపల్లి హైస్కూల్‌కు పిల్లలను పంవద్దని లింగాపురం గ్రామస్తులకు సూచించారు. కేజీబీవీలో నాడు నేడు కింద చేపట్టిన రెండు అదనపు గదుల నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కొత్తపలి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానమంత్రి-3 పథకం కింద ల్యాబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.11 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ల్యాబ్ నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని హెచ్ఎం వెంకటేశ్వర్లుకు సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు ఎంఈఓ బాలాజీ నాయక్, గోకవరం పాఠశాల హెచ్ఎం రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు మాయం

మహానంది: బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామంలోని శ్రీ సుంకులమ్మ ఆలయంలో అమ్మవారికి సమర్పించిన వెండి ఆభరణాలు మాయమైనట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. అమ్మవారిని అలంకరించే వెండి కిరీటం, కళ్లు ఇతర ఆభరణాలు కనిపించడం లేదని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ ఇప్పటికే ఆలయ అర్చకులు, అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశామని, మరికొందరిపై ఆరోపణలు ఉన్నాయని విచారణ చేసి నిజాలు బయటపెడతామని చెప్పారు.

వ్యక్తిపై దాడి

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో దళిత వ్యక్తిపై దాడి జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. శిరిగిరి వెంకటేశ్వర్లు అలియాస్ కరెన్న గ్రామంలో దండోరా వేస్తుంటాడు. శుక్రవారం ఉదయం విద్యుత్ బిల్లులు చెల్లించాలని దండోరా వేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలోనే గ్రామానికి చెందిన బోయ రామచంద్రుడు తన అప్పు చెల్లించాలని బుడబుక్కల శ్రీరాములు బైక్ లాక్కున్నాడు. .. రుణగ్రహీతతో పరిచయం ఉండటంతో వెంకటేశ్వర్లు కలగజేసుకొని అప్పు చెల్లించేందుకు వారం రోజులు గడువు ఇవ్వమని కోరాడు. ఇందుకు ఆగ్రహించిన రామచంద్రుడు తమ్ముడి కుమారుడు బోయ లింగస్వామి వెంకటేశ్వర్లుపై చెప్పుతో దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితుడు ముచ్చుమర్రి పోలీసులను ఆశ్రయించడంతో వారు దర్యాప్తు చేపట్టారు.

కేసీ కెనాల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



కేసీ కెనాల్ ఏఈ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: కేసీ కెనాల్ కార్యాలయమా లేక అటెండర్ గెస్ట్‌హౌసా కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేసే తీరికా అధికారులకు లేదా అని ఎమ్మెల్యే జయసూర్య మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని కేసీ కెనాల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో లష్కర్లు ఎవరూ కనిపించకపోవడంతో హాజరుపట్టికను పరిశీలించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హాజరు అయినట్లు కానీ గైర్హాజరైనట్లు కానీ లేకుండా ఖాళీగా ఉండటంతో కేసీ కెనాల్ ఏఈ నరేష్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు లష్కర్లు విధులకు హాజరవుతున్నారా లేదా అని ప్రశ్నించారు. హాజరుపట్టికలో ఖాళీగా ఉంచితే దేనికి సంకేతమని మండిపడ్డారు. ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైకిల్‌పై సంపూర్ణ భారత్ యాత్ర



మహానందికి వచ్చిన రాజేంద్ర శర్మ

మహానంది: సనాతన ధర్మం అంటే ఆయనకు ఎంతో గౌరవం. చిన్న వయసులోనే హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా సైకిల్‌పై సంపూర్ణ భారత యాత్ర చేపడుతూ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచాడు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 60వేల కిలోమీటర్లు సైకిల్‌పై పర్యటించేందుకు సిద్ధమై ఇంటి నుంచి బయలుదేరిన నాలుగు నెలల అనంతరం మహానందికి చేరుకున్నాడు. వివరాలు.. ఢిల్లీకి చెందిన రాజేంద్ర శర్మ వస్త్ర దుకాణంలో పనిచేసేవాడు. అయితే చిన్నప్పటి నుంచి హిందూ ధర్మం పట్ల ఆకర్షితుడు కావడంతో సైకిల్‌పై సంపూర్ణ భారత్ యాత్ర చేయాలని సంకల్పించాడు. అందులో భాగంగా ఈ ఏడాది మార్చి 13న అయోధ్య నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలను దాటుకుని ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాడు. శుక్రవారం మహానంది ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ఇక్కడి నుంచి అహోబిలం, తిరుపతి మీదుగా వెళ్తానని చెప్పాడు. సంపూర్ణ భారత్ యాత్రలో భాగంగా 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, 51 శక్తి పీఠాలు, చార్ ధామ్, పంచ కేదార్ పర్యటించి స్వగ్రామం చేరతానని రాజేంద్రశర్మ వివరించారు.

ఆత్మకూరు అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. ఆత్మకూరు అభివృద్ధికి కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులకు కొంత సమయం పడుతుందన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పట్టణంలో డప్‌యార్డు సమస్య వేధిస్తుందని, సమస్యను వేగంగా పరిష్కరిస్తామన్నారు. డంప్‌యార్డు కోసం 5 ఎకరాలు కొనుగోలు చేశామని, అందులో డంప్‌యార్డు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. తనను, తన అనుచరులను కించపరిచేలా వ్యవహరిస్తే వదిలేది లేదని, తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అంతకు ముందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనులకు బడ్జెట్ పరిపాలనతో పాటు 15వ ఆర్థిక సంఘం కింద రెండో విడతలో విడుదలైన నిధులతో రూ.10.50 కోట్లతో సీసీ రోడ్డు పనులు, పట్టణంలోని 20వ వార్డులో ఆర్టీసీ కాలనీలో రోడ్లపై గుంతలు ఉండడంతో వాటిని పూడ్చి వేసేందుకు రహదారుల అభివృద్ధికి రూ.లక్ష కేటాయింపు, నీటి సరఫరా కోసం రూ.6,22,135 బిల్లు చెల్లింపులను ఆమోదించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ గ్రేడ్-2గా మారినందుకు ట్రేడ్ లైసెన్సుల రుసుము పెంచుతారన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం కోసం రూ.3 కోట్లు మంజూరయ్యాని, వాటికి టెండర్ల ఆహ్వానంతో పాటు, గృహ నిర్మాణాల అభివృద్ధి, మున్సిపాలిటీ పరిధిలో 68 మంది స్వీపర్లు పనిచేస్తున్నారన్నారు. ఇంకా 30 మందిని తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 12 అంశాలపై చర్చించారని, రెండు మినహా 10 అంశాలను సభ్యులు ఆమోదించారు. చైర్‌పర్సన్ ఆసియామారీఫ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కమిషనర్ హరిప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు చైర్‌పర్సన్, కోఆప్షన్ సభ్యుడు, కమిషనర్ ఎమ్మెల్యేను సన్మానించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జూపాడుబంగ్లా: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను అందులో చేర్పించాలని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి అన్నారు. శుక్రవారం 'బడికిపోదాం' కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన మధ్యాహ్నభోజనం, ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు, అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో అయితే రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించటంతో పాటు పుస్తకాలు, దుస్తులు అన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల శ్రేయస్సు కోరి నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో భార్య,కుమారుడు అరెస్ట్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో ఈనెల 22న దెబ్బలు తాళలేక పి.వెంకటరామయ్య మృతి చెందిన విషయం తెలిసిందే.. హత్యకు కారకులైన మృతుడి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు సాయిాశ్వరుడుని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సున్నిపెంట సీఐ రమేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సున్నిపెంటలోని ఏపీ ట్రాన్స్‌కోలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న పి.వెంకటరామయ్య తాగుడుకు బానిసగా మారాడు. మద్యం తాగి ఇంటికి వచ్చిన ప్రతిసారీ భార్య, భర్తల మధ్య ఉన్న సమస్యల కారణంగా గొడవ పడేవారు. ఈ క్రమంలో..ఈనెల 10వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రామయ్య భార్యతో గొడవపడటంతో మైనర్ కుమారుడు, భార్య కలిసి రామయ్యను తీవ్రంగా కొట్టారు. దీంతో ఆయన అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఈనెల 22వ తేదీన మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి హత్య కేసుగా నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో భారీగా అంతర్గత బదిలీలు జరిగాయి. శుక్రవారం పలువురు ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు ఈఓ తెలిపారు. డిప్యూటీ ఈఓ ఆర్.రవణమ్మకు ఎస్టాబ్లిష్ మెంట్, అకౌంట్ సెక్షన్ కేటాయించారు. అలాగే సహాయ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి అన్న ప్రసాద వితరణ పర్యవేక్షణ, అడిట్ విభాగం అప్పగించారు. ఏఈఓ ఫణిదరన్ ప్రసాద్‌కు రెవెన్యూ, పారిశుద్ధ్యం, రెవెన్యూ సెక్షన్ ఏఈఓగా ఉన్న మల్లికార్జున రెడ్డిని కర్నూలు సమాచార కేంద్రం పర్యవేక్షణ, శ్రీశైల ప్రభ నిర్వహణ, దత్తత దేవాలయాల పర్యవేక్షణ కేటాయించారు. హరిదాసుకు యథావిధిగా ఆలయం కేటాయించారు. స్వాములకు అదనంగా క్యూలైన్ల, డొనేషన్ కౌంటర్, ఆర్జిత సేవ కౌంటర్ల పర్యవేక్షణ కేటాయించారు. బదిలీ అయిన ఉద్యోగులు వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెంకటాపురంలో ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిని కాచి చల్లార్చి తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో బ్లీచింగ్, సున్నం చల్లించారు. వైద్య సిబ్బంది యశోద, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ,బీకాం,బీఎస్సీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జూలై 1వ తేదీ నుంచి తమ పేర్లను నమోదు చేసుకొని కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని చెప్పారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు,



లింగాపురంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దృశ్యం

కొత్తపల్లి: వర్షాకాలంలో దోమల తీవ్రత పెరిగి విష జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు జబీర్, హకీమ్ రషీద్ సూచించారు. శుక్రవారం ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఎర్రమఠం, పాత మాడుగుల, ఎర్ర మఠం చెంచుగూడెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి దోమ లార్వా నివారణ గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్వర లక్షణాలు కనిపించగానే పీహెచ్‌సీలకు వెళ్లాలన్నారు. అలాగే దోమలు వృద్ధి చెందకుండా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సత్యం రెడ్డి, శాంతమ్మ, సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మహానంది: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు, జి. లింగాపురం గ్రామాల సర్పంచులు జ్ఞానాభరణం, రాధమ్మ తెలిపారు. రెండు గ్రామాల్లో శుక్రవారం డ్రైడే..ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక ద్రావణాన్ని పిచికారీ చేశారు పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, సునీత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీశైలంప్రాజెక్ట్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీనియర్ ఎంటమాలజిస్ట్ కం శానిటేరియన్, వైద్యసిబ్బంది రవిప్రకాష్, బాలనరసయ్య తెలిపారు. శుక్రవారం గిరిజన గురుకుల కళాశాలలో వ్యాధులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వర్షాకాలం సమీపించడంతో దోమల వ్యాప్తి పెరిగిందని, దోమ కాటు, కలుషిత నీటిని సేవించడం వలన మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ, టైఫాయిడ్, కలరా, డయేరియా తదితర వ్యాధులు సోకుతాయన్నారు. చలితో కూడిన జ్వరం, విడిచి విడిచి జ్వరం రావడం, చెమటలు పట్టడం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎం.రత్నమ్మ, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సురక్షిత నీటి సరఫరే లక్ష్యం



నీటినమూనాలు పరిశీలిస్తున్న దృశ్యం

మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు సరక్షిత నీరు అందించడమే తమ లక్ష్యమని సూపరింటెండెంట్ ఇంజినీర్ మనోహర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడుమూరు, కలమందలపాడు గ్రామాల్లో నీటి సరఫరాను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలోని బోరుబావుల్లో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు చేయాలన్నారు. రిపోర్టు సరిగా రాకపోతే ఆ బోరు బావిలను తాత్కాలింగా నిలిపివేయాలని సూచించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేయాలన్నారు. ట్యాంకు చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యపనులు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమేష్, పంచాయతీ కార్యాదర్శి కళ్యాణ్ సింగ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం

మండల పరిధిలోని పీరుసాహెబ్‌పేట, కడుమూరు, తలముడిపి, వీపనగండ్ల తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేసినట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో పనులు పరిశీలించిన ఆమె ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలని సిబ్బందికి సూచించారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ప్రవేశానికి రెండవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను రెండు సంవత్సరాల ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్‌మెన్ సివిల్ కోర్సులు, ఒక సంవత్సరం మెకానికల్ డీజిల్, వెల్డర్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అన్ని కోర్సులకు అర్హులని, వెల్డర్ కోర్సుకు పదవ తరగతి ఫెయిల్ అయిన వారు కూడా అర్హులన్నారు. ఆసక్తి గలవారు జూలై 24వ తేదీలోపు www.iti.ap.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు జూలై 25వ తేదీలోగా తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకొని 27వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శ్రీశైలం ప్రభుత్వ ఐటీఐలో హాజరు కావాలని సూచించారు.

1న ఉపాధి హామీ పనులపై గ్రామసభ

వెలుగోడు: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో జూలై 1వ తేదీన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వేల్పుల జయపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ప్రాధాన్యత క్రమం, పనుల అమలులో పురోగతి, భౌతిక, ఆర్థిక- ప్రగతి నివేదికలు, 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ, పంచాయతీ నిధుల నుంచి చేపడుతున్న పనుల పురోగతి, చేపట్టాల్సిన పనుల వివరాలపై గ్రామ సభలో చర్చిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, అనర్హతలపై సభలో వివరిస్తామన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ నివేదికలు, మహిళ, శిశు సంక్షేమం, సామాజిక పింఛన్లు, రెవెన్యూ, విద్యా సంబంధిత అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

చెత్త కుప్పలు తొలగించండి

ఆత్మకూరు: మండలంలోని బాపునంతపురం గ్రామ సమీపంలో ఆత్మకూరు-నంద్యాల ప్రధాన రహదారిలో ఉండిపోయిన చెత్తకుప్పలను మున్సిపల్ అధికారులు తొలగించాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలో చెత్త కుప్పలు నిల్వ ఉండడం వల్ల రోడ్డు వెంటే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గాలికి దుమ్ము కళ్లల్లో పడుతోందని, దీంతో పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.



ఆత్మకూరు-బాపనంతపురం గ్రామాల మధ్య చెత్తకుప్పలు